క్లుప్తంగా

క్రమశిక్షణతో మెలగాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ సునీల్

నాగలాపురం: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఎస్ఐ సునీల్ తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో సామాజిక మాధ్యమాల ప్రభావంతో విద్యార్థులలో విపరీత ప్రవర్తన, క్రమశిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ సునీల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లకు బానిస కాకుండా కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య పాల్గొన్నారు.

రూ. 22 లక్షల స్వాహా!

సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం, కొత్తమారికుప్పం పంచాయతీల నిధులు రూ. 22 లక్షలు స్వాహా చేసినట్లు ఘటన వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. దాసుకుప్పం పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.18.75 లక్షలు, కొత్తమారి కుప్పం పంచాయతీలో రూ.3.06 లక్షలు పంచాయతీ కార్యదర్శి లోకేష్ డ్రా చేశారు. దీనిని గుర్తించిన మండల పరిషత్ అధికారులు, ఈఓపీఆర్డీ తరుణాక్ష రెడ్డి ఈ విషయమై నివేదిక తయారు చేసి, జిల్లా పంచాయతీ అధికారికి పంపినట్లు సమాచారం. నిధులు గోల్‌మాల్‌పై అధికారులు విచారణలో మరిన్ని విషయాలు బయటపడే అవకాశాలు ఉన్నాయి.

అక్రమ నిర్మాణాల తొలగింపు



ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ సురేష్‌బాబు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం జీపాళెం పంచాయతీలోని జగనన్న కాలనీలో పేదల ప్లాట్లలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తహసీల్దార్ సురేష్ బాబు పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులైన పేదల ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. అందులో రేణిగుంట మండలం జీ పాళెం పంచాయతీ, పద్మానగర్ సమీపంలోని జగనన్న కాలనీలో పేదలకు ఇచ్చిన 10 ప్లాట్లలో తిరుపతికి చెందిన వ్యక్తులు ప్రహరీ గోడ కట్టారు. పట్టాదారులు తమ స్థలాన్ని చూసుకోవడానికి వెళ్లగా అక్కడ ఆక్రమించి ప్రహరీ నిర్మించి ఉండడం చూసి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. విచారించిన తహసీల్దార్ శనివారం రెవెన్యూ సిబ్బందితో అక్రమ కట్టడాలను తొలగించారు. ప్రభుత్వ భూములు, జగనన్న లేఅవుట్లలో ఎవరైనా కబ్జాకు పాల్పడితే పోలీస్ కేసులతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సులభరీతిలో బోధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రవి

సత్యవేడు: విద్యార్థులకు సులభ రీతిలో బోధించాలని ఎంఈఓ రవి సూచించారు. శనివారం సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో సీఆర్సీ సమావేశం జరిగింది. 74 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సీ,డీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థులను ఏ,బీ గ్రేడ్లలోకి తీసుకు వచ్చేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులకు చదువుపై మక్కువ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భారతి పాల్గొన్నారు.

వినియోగంలోకి సంపద కేంద్రాలు



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

సత్యవేడు: నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్‌పీఓ రవీంద్రబాబు అన్నారు. శనివారం సత్యవేడు పంచాయతీలోని చెత్త సంపద కేంద్ర(ఎస్‌డబ్ల్యూపీసీ)కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణపై పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. వర్మీ కంపోస్టు తయారీ ప్రక్రియ వేగవంతం చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ తరుణాక్షరెడ్డి, కార్యదర్శి ముని రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్, బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లు, మోహన్ బాబు , టీడీపీ నాయకుడు శివానందం పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

సత్యవేడు: స్థానిక తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం తిరుపతి కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. వరదయ్యపాళెం తహసీల్దార్ రాజశేఖర్‌కు సత్యవేడు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.



● పరిశీలన

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని తారకరామనగర్‌లో చెత్త సంపద కేంద్రాన్ని శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. స్థానిక మహిళలకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వడంతో కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం వర్మీ కంపోస్టు ఎరువును మహిళలకు పంపిణీ చేశారు.

–శ్రీకాళహస్తిరూరల్(రేణిగుంట)



● ప్రతిజ్ఞ

తొట్టంబేడు పీహెచ్‌సీలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆరోగ్య కేంద్రం శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందితో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ ప్రతిజ్ఞ చేయించారు.

–శ్రీకాళహస్తి



● ప్రత్యేక శిక్షణ

రేణిగుంటలో పోషణ బి పడాయి బి అనే అంశంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులపాటు జరిగిన ప్రత్యేకశిక్షణ తరగతులు శనివారం సాయంత్రం ముగిశాయి. రేణిగుంట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సీడీపీఓ కృష్ణమంజరి ఆధ్వర్యంలో జరిగిన ఈ తరగతుల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమావతి మాట్లాడుతూ రక్తహీనతకు గురవుతున్న పిల్లలపై దృష్టి సారించాలన్నారు.

–శ్రీకాళహస్తిరూరల్(రేణిగుంట)

ప్రణాళికతో ఫలితాలు పదిలం

- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు
- పక్కా ప్రణాళికతో ముందుకు
- పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు



బుచ్చినాయుడుకండ్రిగలో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థుల నోట్‌బుక్‌ని పరిశీలిస్తున్న ఎంఈఓ

విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకం. ఇక్కడ సాధించే మార్కులు, గ్రేడ్లతోనే ఉన్నత విద్యలో మంచి కోర్సుల ఎంపికకు అవకాశం. ఈ ఏడాది మార్చి 17వ తేదీన పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. వారి సందేహాలు నివృత్తి చేస్తున్నారు.వెనుకపడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఒక ప్రణాళిక రూపొందించుకుని చదివిస్తున్నారు. దీంతో పది పరీక్షల్లో ఫలితాలు ఉత్తమంగా ఉంటాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

జెడ్పీహెచ్ఎస్ పేరు	పది విద్యార్థులు
బుచ్చినాయుడుకండ్రిగ	131
చల్లమాంబపురం	8
కల్లివెట్టు	29
నెలవాయి	38
పల్లమాల	61
మొత్తం	267



నెలవాయి పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న తెలుగు టీచర్ పురుషోత్తం

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థికి పదో తరగతి కీలకం. ఈ పరీక్ష ఫలితాలపైనే విద్యార్థులు భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. దీంతో అటు ఉపాధ్యాయులు విద్యార్థులు పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా వందరోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. మార్గదర్శకాలు జారీ చేయడంతో రెండో శని, ఆదివారాల్లో సైతం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఇంటర్, డిగ్రీలో మంచి కోర్సులు ఎన్నుకుని, వాటిలో రాణించడానికి అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో విద్యార్థులు ఎంచుకునే ప్రతి గ్రూపునకు పదో తరగతి మార్కులనే పరిగణలోకి తీసుకుంటారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ, నిరంతరం శ్రమిస్తూ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా ఎప్పటికప్పుడు ఎసైన్‌మెంట్లు, మాక్ టెస్టులు నిర్వహిస్తే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

మెరుగైన ఫలితాల సాధనకు..

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో డిసంబర్ నెల నుంచి మార్చి వరకు వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. మండలంలో బుచ్చినాయుడుకండ్రిగ, నెలవాయి, కల్లివెట్టు, చల్లమాంబపురం, పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 267 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. వెనుకబడిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తున్నారు. విద్యార్థులకు పరీక్షలంటే భయం తొలగించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి స్లిప్ పరీక్షలను నిర్వహిస్తూ, వారిలో నైపుణ్యాన్ని వెలికి తీస్తున్నారు.

అదనపు తరగతుల నిర్వహణ



వంద రోజులు ప్రణాళికలో భాగంగా రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5.30 గంటలు వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక పాఠ్యాంశం, సాయంత్రం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు. అలాగే సెలవు రోజుల్లో కూడా టెన్త్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. ఉదయం ఒక సబ్జెక్టు, మధ్యాహ్నం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తూ, వారిలో భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసం నింపేలా కృషి చేస్తున్నారు.

–ముని సుబ్రమణ్యం, ఎంఈఓ–2

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి,



పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేస్తున్నాం. విద్యాశాఖ అందించిన 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తూ, సెలవు దినాల్లోనూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా వెనుకబడిక వారిని ప్రత్యేక శ్రద్ధతో చదివిస్తున్నాం.

–రమణయ్య, హెచ్ఎం, జెడ్పీ హైస్కూల్, బీఎన్‌కండ్రిగ

ప్రణాళిక ప్రకారం తరగతులు



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు విద్యను బోధిస్తున్నాం. విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇస్తూ, మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– శ్రీనివాసులు, తెలుగుటీచర్, బీఎన్‌కండ్రిగ

స్టడీ అవర్స్‌తో ఉపయోగం



ఉదయం, సాయంత్రం పూట నిర్వహించే స్టడీ అవర్స్ ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రతి అంశాన్ని ఉపాధ్యాయుల నుంచి నేర్చుకుంటున్నాం. మా అభ్యున్నతికి ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. మంచి మార్కులు తెచ్చుకుంటాం.

–దీపిక, పదోతరగతి

పరీక్ష అంటే భయం లేదు



ఇది వరకు పరీక్ష అంటే భయంగా ఉండేది. అయితే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండంతో భయం పోయింది. ప్రత్యేక తరగతిలో మంచిగా చదువుకొంటున్నాం. ఉపాధ్యాయులు మాపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

–శ్రీనివాసులు, పదోతరగతి

సంతలో తనిఖీలు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంటలోని సంతలో రాత్రి సమయంలో తూకాల్లో అవకతవకలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులతో తిరుపతి తూనికలు కొలతల విభాగం ఇన్‌స్పెక్టర్ మల్లీశ్వర్ తమ సిబ్బందితో శనివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. కూరగాయల దుకాణాల్లో వేయింగ్ మిషన్లు, తూకం గుండ్లను పరిశీలించారు. కొందరు వ్యాపారులు మాగ్నెట్ పెట్టినట్లు గుర్తించి వారిని హెచ్చరించారు. అధికారులు గజేంద్ర నాయుడు, రమేష్, పెదబాబు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోండి

నారాయణవనం: మండలంలోని రైతులు తమ పొలం వివరాలతో రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ శోభారాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహకాలు, పంట బీమా పొందడానికి తప్పనిసరిగా రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. తమ పొలం పాసుపుస్తకం, ఆధార్, లింక్ అయిన ఫోన్లతో రైతు సేవా కేంద్రాలల్లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఇళ్ల పట్టాలు సిద్ధం చేయండి

వరదయ్యపాళెం: పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల పంపిణీకి పట్టాలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం తహసీల్దార్లకు దిశానిర్దేశం చేశారు. శనివారం వరదయ్యపాళెం రెవెన్యూ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం 15 ఎకరాల భూసేకరణ చేశారని, అయితే పలు కారణాలతో పట్టాలు పంపిణీ ఆగిపోయిందన్నారు. తక్షణమే అర్హత కలిగిన వారితో జాబితా సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదించాలన్నారు. తహసీల్దార్లు రాజశేఖర్, సుబ్రమణ్యం, ఎంపీడీఓ ప్రసాద్, డీటీ వెంకటసుబ్బయ్య, ఆర్ఐ శివకుమార్, నేతలు యుగంధర్ రెడ్డి, నిర్మల్, జయచంద్ర నాయుడు పాల్గొన్నారు.

ఇరువర్గాలఘర్షణ

– ఒకరికి తీవ్ర గాయాలు

నాగలాపురం: మండలంలోని జానికాపురంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో రాఘవయ్య కుమారుడు టి.వెంకటేశు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుల కథనం మేరకు.. జానికాపురంలో టి.వెంకటేశులు నివాసానికి ఎదురుగా కుమార్ కాపురం ఉంటున్నాడు. వెంకటేశులు ఇంటి వద్ద మురుగు నీటి కాలువను పూడ్చేశారని కుమార్ గొడవ పడ్డాడు. గ్రామస్తులు సర్ది చెప్పినా ఎవరి మాట లెక్క చేయక కుమార్ తన అనుచరుడు త్యాగరాజ్‌తో కలిసి వెంకటేశులుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగలాపురం ఎస్ఐ సునీల్ త్యాగరాజు తెలిపారు.

పరిసరాల శుభ్రత పాటిద్దాం

నాగలాపురం: ప్రతి ఒక్కరూ తమ చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శనివారం ఉదయం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుని, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొని, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ కార్యాలయాలతోపాటు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. తరువాత అధికారులు, నాయకులు శ్రీనివాసయాదవ్, సెల్వకుమార్, ప్రజా ప్రతినిధులు, ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేసి, ప్రజలకు చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హనుమాన్ నాయక్, ఎంపీడీఓ నాగరత్నమ్మ, ఏపీఓ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి

నాగలాపురం: మండలంలోని బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని పిచ్చాటూరు సీడీపీఓ శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్లస్‌లో పిచ్చాటూరు సీడీపీఓ శోభారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు పోషణ్ భీ-పడాయిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో పోషక లోపాలను గుర్తించి పిల్లల ఎదుగుదల బాగుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పంపించే పోషకాహారాలను పిల్లలు, బాలింతలకు సక్రమంగా అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, సీహెచ్ఓ వేణుగోపాల్, ఐఆర్‌టీ భవిత పాల్గొన్నారు.

పానగల్ దర్గాలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్



హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్‌ను సన్మానిస్తున్న దర్గా నిర్వాహకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్ దర్గా వీధిలో హజరత్ జూమ్లేష పీర్ దర్గాను శనివారం వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ జనాబ్ నజీర్ ఖాన్ సాహెబ్ సందర్శించారు. దర్గా నిర్వాహకుల సయ్యద్ బాబా ఫరీద్ ఫాతిహా ఆయనకు శాలువతో కప్పి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నుంచి విచ్చేసిన సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీ, దర్గా నిర్వాహకులు మిర్యాల బాబా జుబేర్ సాహెబ్, మహబూబ్ సుహాని జెండా ముత్తువల్లి షేక్ మిర్జాన్ సాహెబ్, ఎంఎస్ జమ్రుద్ బాషా అబ్దుల్లా, షకీల్, భావజాన్ షాహి, అమీన్, యాకూబ్ పాల్గొన్నారు.

సాక్షి స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలి



సాక్షి స్టడీ మెటీరియల్‌ను చూపుతున్న సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు

సత్యవేడు: సాక్షి దినపత్రిక యాజమాన్యం పదో తరగతి ఇంగ్లిషు మీడియం విద్యార్థులకు అందజేసిన ఫిజిక్స్, లెక్కల స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం భారతి కోరారు. శనివారం సాక్షి సర్కులేషన్ సిబ్బంది సురేష్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఎంఈఓ రవి, ప్రధానోపాధ్యాయురాలు భారతి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. సత్యవేడు, మదనంబేడు, దాసుకుప్పం, సత్యవేడు బీసీ గురుకుల పాఠశాల, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలు అందజేశారు.

ఓపీకి డాక్టర్లు హాజరు కావాల్సిందే



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

శ్రీకాళహస్తి: ఓపీకి తప్పకుండా డాక్టర్లు హాజరు కావాల్సిందేనని డీఎంహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణనాయక్ ఆదేశించారు. ఆయన శనివారం తొట్టంబేడు మండలంలోని కాసరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాసరం పీహెచ్‌సీపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆయన తనిఖీ చేసినట్టు సమాచారం. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని డాక్టర్ మాధవ్, తేజస్విని ఆదేశించారు. తర్వాత ఆస్పత్రి ఆవరణలో జరిగిన ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్లు సాయి పూజ, లహరి తదితరులు పాల్గొన్నారు.

సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్‌కు నివాళులు



సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ కి నివాళులర్పిస్తున్న బంజారీలు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ పరిధిలోని బంజారా హిల్స్ కాలనీలో శనివారం శ్రీ హథీరాం బావాజీ బంజారా సేవా సాంఘ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలను సుగాలీలు సంప్రదాయ పద్ధతిలో జరుపుకున్నారు. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి సంప్రదాయ పద్ధతిలో హోమ పూజ చేసి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న తండాల్లో సుగాలీల సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని, యువత నగర సంప్రదాయానికి అలవాటు పడుతున్న పరిస్థితుల్లో తమ సంప్రదాయాలను కాపాడుకోవడానికి రేణిగుంటలో ప్రత్యేకంగా తండా బంజారా హిల్స్ కాలనీ పేరుతో ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బంజారా హౌసింగ్ సొసైటీ నాయకులు లక్ష్మీ రామ్‌నాయక్, సోమ్యా నాయక్, నారాయణ స్వామి నాయక్, సురేష్ నాయక్, అంజి నాయక్, హేమంత్ నాయక్, ప్రవీణ్ కుమార్, చంద్ర నాయక్, సురేందర్ నాయక్, చొడ నాయక్ పాల్గొన్నారు.